సాక్షి
విజయనగరం

శనివారం । 15 । జూన్ । 2024



పోషకాలతోనే పశుసంపద వృద్ధి

పోషకాలతోనే పశుసంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో దాణా అందజేయాలన్నది పశుసంవర్ధక శాఖాధికారులు చెబుతున్నారు. - 8లో



విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌లు అందాలి - 8లో

స్టూడెంట్ కిట్‌ల పంపిణీ పక్కాగా సాగాలని స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పన అన్నారు.



భార్య టీడీపీ.. నేను వైఎస్సార్‌సీపీలోనే... - 8లో

భార్య టీడీపీలో చేరితే తనను ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించారని రఘురాజు అన్నారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం



జె.శ్రీనివాసరావు, డీఎం, విజయనగరం

విజయనగరం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల వినతులు, సూచనల స్వీకరణ కోసం ఈ నెల 15న శనివారం 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని విజయనగరం ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో ఎలాంటి సమస్యలనైనా ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య సెల్:99592 25620 నంబర్‌కు కాల్‌చేసి తెలియజేయాలని కోరారు.

ఈఐడీ ప్యారీలో రక్తదానశిబిరం



ఈఐడీ కర్మాగారంలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కర్మాగారంలో పనిచేస్తున్న 70 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజాం ప్రతినిధి కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో చాలామంది క్షతగాత్రులు రక్తం లేక ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. రక్తదానానికి అందరూ ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ ఆర్ హెడ్ మురళీకృష్ణ, రెడ్ క్రాస్ ప్రతినిధులు నారాయణ, సుజాత, పవన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసినవారికి మెడల్స్ అందించారు.

ప్రత్యేక డీఎస్సీకోసం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను గిరిజన నిరుద్యోగ యువతీ యువకులతో భర్తీ చేసేలా నూతన ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రామస్వామి, సీఐటీయూ కోశాధికారి గొర్లి సన్యాసి డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా బెలగాం సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో జీఓ నంబర్ 3 అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. తక్షణమే గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 39వేల పోస్టులు ఖాళీగా ఉన్నా కేవలం 16,350 పోస్టులకు మాత్రమే మెగా డీఎస్సీ పేరుతో తీయడం విచారకరమన్నారు. ఐటీడీఏ పరిధిలోని బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

గురువుల మూగవేదన



- ప్రైవేటు విద్యాసంస్థల్లో బోధనేతర పనులతో వేధింపులు
- ప్రవేశాలు తేకుంటే జీతం కట్
- చెప్పింది చేస్తేనే ఉద్యోగం ఉంటుందని యాజమాన్యాల హెచ్చరికలు
- జిల్లాలో 431 ప్రైవేటు స్కూళ్లు, 79 జూనియర్ కళాశాలల్లో 6వేల మంది ప్రైబడి బోధన సిబ్బంది
- తనిఖీల్లో బోధన సిబ్బంది సమస్యలపై ఆరా తీయాలి: ప్రైవేటు అధ్యాపకుల డిమాండ్

విజయనగరం అర్బన్:

'ఎమ్మెస్సీ, బీఈడీ అర్హతగల పట్టభద్రుడు ఓ ప్రైవేటు పాఠశాలలో దశాబ్దకాలంగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇటీవల ఆరోగ్యం బాగులేదు. స్కూల్ యాజమాన్యం చెప్పిన అడ్మిషన్ల టార్గెట్‌ను సాధించలేకపోయాడు. అంతే.. ఆయనను నిర్దాక్షిణ్యంగా విధుల్లోంచి యాజమాన్యం తొలగించింది.'

అక్కడ పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు యాజమాన్యాల చేతిలో కీలుబొమ్మలు. పాఠాలు బోధించడం ఒక్కటే వారి పనికాదు. ఏది చెబితే అది చేయాల్సిందే. లేదంటే ఉద్యోగం ఊడిపోతుంది. పాఠశాలలో విద్యార్థుల ప్రమోషన్‌లు, అడ్మిషన్లు తదితర బాధ్యతలన్నీ వారే చూడాలి. విద్యార్థులను చేర్పించే పనిపై వారికి టార్గెట్ ఇస్తారు. దానిని రీచ్ అవ్వకపోతే ఉద్యోగం కొనసాగించే పరిస్థితి ఉండదు. ఇదీ జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకుల పరిస్థితి. విద్యార్థులను చేర్పించే విధులు నిర్వహించేందుకు గతంలో పీఆర్‌ఓల పేరుతో ఉద్యోగాలు ఉండేవి. ఆ పోస్టులను తీసేసి ఆ పనిని ఉపాధ్యాయులు, అధ్యాపకులతో చేయిస్తున్నారు. ఎంతో మంది పీజీ, డిగ్రీ, బీఈడీలు చేసిన వారు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. వీరంగా బోధనేతర పనులతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేసవి సెలవుల్లో కూడా వీరంతా విధుల్లోనే ఉండాల్సిన దుస్థితి. పాఠ్యాంశాలు బోధించేవారిని ప్రవేశాల పేరుతో మండుటెండల్లో తిప్పుతున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మీ ఇంట్లో చదువుకునే పిల్లలు ఉన్నారా... ఏం చదువు తున్నారు.. మా పాఠశాలలో, కళాశాలలో చేర్పించండి అంటూ ప్రాధేయపడుతున్నారు.

మానసిక ఒత్తిడితో ఇబ్బందులు

ఒక వైపు బోధన... మరోవైపు టార్గెట్‌ను పూర్తి చేసే పనిలో ప్రైవేటు, కార్పొరేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం అయిన తరువాత ఆగస్టు నుంచే వచ్చే విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల కోసం వేట సాగించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ విద్యాసంస్థల్లో ఉద్యోగ హక్కుల అమలుపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడం వల్ల రోజురోజుకీ వీరికి బోధనేతర పనులు పెంచుతున్నారని ఆరోపిస్తున్నారు. తమ వేదనను ఎవరికీ చెప్పుకోలేక లోలోపల కుమిలి పోతున్నారు. మరోవైపు చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న సమయంలో ఉన్న ఉద్యోగాన్ని వదులుకోలేక, అక్కడే ఉండలేక ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి.

తనిఖీల్లో బోధన సిబ్బంది సమస్యలపై ఆరా తీయాలి

ప్రైవేటు విద్యాసంస్థలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడతారు. ఆ సమయంలో అక్కడ రికార్డులు, బోధన సిబ్బంది అర్హతలను పరిశీలిస్తారు. ఆ సమయంలో ఆయా స్కూళ్లు, కళాశాలల్లోని బోధన సిబ్బందితో చేయిస్తున్న విధులు, సమస్యలపై కూడా ఆరాతీయాలి. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి. సిబ్బందిపై వేధింపులు వీడేలా యాజమాన్యాలపై ప్రైవేటు సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు పోరాడాలి.

– ఎస్.తిరుమలరావు, అధ్యాపకుడు, ఓ కార్పొరేట్ విద్యాసంస్థ

టార్గెట్ పూర్తిచేస్తేనే ఉద్యోగంలో కొనసాగింపు

అడ్మిషన్ల టార్గెట్లు పూర్తి చేస్తేనే సెలవుల్లో జీతాలు ఇస్తామని కొన్ని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు పెడుతున్నాయి. ఒక్కొక్కరు కనీసం 10 నుంచి 15 మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి. అలా చేర్పించిన తర్వాత కూడా సెలవుల అనంతరం పాఠశాల తెరిచిన తరువాత ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో గ్యారంటీ లేదు. ఇచ్చే అరకొర జీతాలు నిలిపి వేస్తారనే భయంతో ఉపాధ్యాయులు, సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. పిల్లలను చేర్పించడం ఒక పని అయితే, స్థానికంగా పాఠశాలల నిర్వహణ చూసే బాస్‌లు సిబ్బంది పట్ల మాట్లాడే భాష, వారి ప్రవర్తన మరింత ఇబ్బంది పెట్టేలా ఉంటోందని పలువురు ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు వాపోతున్నారు. అడ్మిషన్ల కోసం నోటికి ఏది వస్తే అది మాట్లాడి మనోభావాలు దెబ్బతీస్తున్నారంటున్నారు. మహిళా సిబ్బంది అడ్మిషన్ల కోసం ఎండలో తిరిగి వడదెబ్బ తగిలి ఆస్పత్రి పాలైనా యాజమాన్యం పట్టించుకున్న దాఖలాలు ఉండవు.

431 ప్రైవేటు పాఠశాలల్లో 5 వేల మంది బోధనా సిబ్బంది

జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద 2,233 విద్యాసంస్థలు ఉన్నాయి. 431 స్కూళ్లు ప్రైవేటు యాజమాన్యాలు నడుపుతున్నాయి. వీటిలో 127 స్కూళ్లు ప్రైమరీ, 149 అప్పర్ ప్రైమరీ, 155 హైస్కూల్స్ ఉన్నాయి. ఇందులో విజయనగరం, బొబ్బిలి పట్టణాల్లో కార్పొరేట్ విద్యాసంస్థలున్నాయి. ఉన్నత విద్యార్హతలున్న దాదాపు 5,674 మంది ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విద్యాబోధనలు అందిస్తున్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్ విద్యను 79 ప్రైవేటు జూనియర్ కళాశాలలు అందిస్తున్నాయి. వీటిలో 600 వందల మంది వరకు అధ్యాపకులు పనిచేస్తున్నారు.

గాలివాన



సంతగవిరమ్మపేటలో కూలిన భారీ వృక్షాలు

- నేలకూలిన చెట్లు
- విరిగిన 28 విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ శాఖకు రూ.7లక్షల నష్టం

ఎస్.కోట మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం జనాన్ని వణికించింది. విద్యుత్ శాఖకు నష్టాన్ని మిగిల్చింది. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకూ భీకర గాలులు వీయడంతో పలు గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. 28 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం సిబ్బంది గ్రామాల్లోకి పరుగు తీశారు. సుమారు 7 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు విద్యుత్‌శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది.

– శృంగవరపుకోట



గోపాలపల్లిలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



ప్రభుత్వ కార్యాలయంలో 'పార్టీ'





ఈ చిత్రాలు చూశారా.. వీరిలో అధికార పార్టీ ఎమ్మెల్యే లేరు. ప్రజాప్రతినిధులూ హాజరుకాలేదు. ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రైవేటు కార్యక్రమాలకు వినియోగించరాదన్న నిబంధనను తుంగలో తొక్కి.. కొందరు టీడీపీ నాయకులు యథేచ్ఛగా కార్యాలయంలోనే 'పార్టీ' చేసుకున్నారు. కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. చీపురుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ ఘటనను చూసి అక్కడి సిబ్బందితో పాటు స్థానికులు అవాక్కయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదేం పని అంటూ విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడిన మూడు, నాలుగు రోజులకే ఇలా అయితే.. ముందుముందు మరెన్ని సిత్రాలు చూడాలో అన్న చర్చసాగింది. ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కుమారుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు ఆధ్వర్యంలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన టీడీపీ నాయకుల తీరును తప్పుబట్టారు. ఎమ్మెల్యే లేని సమయంలో పార్టీ కార్యాలయాల్లో చేసుకోవాల్సిన కార్యక్రమాలను ఇలా ప్రభుత్వ కార్యాలయాల్లో చేయడంపై విస్మయం వ్యక్తంచేశారు. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించరాదన్న విషయం కూడా తెలియకపోవడం విచారకరమన్నారు.

– చీపురుపల్లి

'రాష్ట్రీయ బాలపురస్కార్' కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు అర్హులైన బాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి బి.శాంతకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసాధారణమైన, వీరోచిత ప్రతిభ కనబరిచిన పిల్లలు (6–18) దరఖాస్తుకు అర్హులని చెప్పారు. అవార్డులు కోసం హెచ్‌టీటీపీఎస్ అవార్డ్స్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో జూలై 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాష్ట్ర మహాసభలకు సమాయత్తం



ఏపీటీఎఫ్ కరపత్రాలు, పుస్తకాలను అందజేస్తున్న సంఘ నాయకులు

బొబ్బిలి: రానున్న దసరా సెలవుల్లో నిర్వహించే ఏపీటీఎఫ్ విద్యా వైజ్ఞానిక మహా సభలకు సన్నద్ధం కావాలని జిల్లా అధ్యక్షుడు ఎం.బలరాంనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద శుక్రవారం సాయంత్రం నాలుగు మండలాల ప్రాంతీయ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీటీఎఫ్ స్థాపించి 80 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు సంఘ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, సామాజిక కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో హాజరయ్యేలా ఇప్పటి నుంచే సమాయత్తం చేయాలన్నారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన పుస్తకాలు, కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ సభ్యులు దాసరి వెంకటనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు గంట సత్యనారాయణ, సీహెచ్ రామారావు, బొబ్బిలి గౌరవాధ్యక్షుడు టి.భానుప్రకాష్, తెర్లాం ప్రధాన కార్యదర్శి కె.గోపాల కృష్ణనాయుడు, బాడంగి మండలాధ్యక్షుడు నాని వాణీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ కార్మికుల రాస్తారోకో

- అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని డిమాండ్
- కర్మాగారం నుంచి 6 కిలోమీటర్ల మేర పాదయాత్ర
- కొత్తవలస కూడలిలో మానవహారం, బైఠాయింపు
- కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ డిమాండ్



జిందాల్ కర్మాగారం నుంచి పాదయాత్రగా కొత్తవలస కూడలికి వస్తున్న కార్మికులు, సంఘ నాయకులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తేయాలని కోరుతూ కార్మిక సంఘ జేఏసీ నాయకులు నెక్కల నాయుడుబాబు, టి.వి.రమణ తదితరుల ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. కర్మాగారంలో పని చేస్తున్న 57 మంది పర్మినెంట్ కార్మికులు, 264 మంది కాంట్రాక్టు కార్మికులు కర్మాగారం నుంచి సుమారు 6 కిలో మీటర్ల దూరంలో గల కొత్తవలస కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తవలస మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి కర్మాగార యాజమాన్య వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. దీంతో సుమారు 25 నిమిషాలు పాటు ట్రాఫిక్ స్తంభించింది. అనంతరం జేఏసీ నాయకులు నెక్కల నాయుడుబాబు, టి.వి.రమణ మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న దోరణి సరైనది కాదన్నారు. 40 సంవత్సరాల పాటు కర్మాగారాన్ని నమ్ముకొని పనిచేస్తే ఇప్పుడు అర్ధాంతరంగా కర్మాగారాన్ని యాజమాన్యం మూసివేయడాన్ని తప్పుబట్టారు. కర్మాగారంలో 40 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కనీసం ప్రమోషన్‌లు, ఇంక్రిమెంట్‌లను సైతం ఇవ్వలేదని దుయ్యబట్టారు. లాభాలు వచ్చినప్పుడు ఫ్యాక్టరీలు నడిపి, కొద్దిపాటి నష్టాలు వచ్చేసరికి మూసేస్తే వాటిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కార్మిక కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరించే యాజమాన్యాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి శిక్షించాలని డిమాండ్‌చేశారు. జిందాల్ యాజమాన్యం కార్మికుల హక్కులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. కర్మాగారాన్ని తక్షణమే తెరిచి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. చర్చలపేరిట కాలయాపన చేస్తే తగు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఒకటి రెండు రోజుల్లో యాజమాన్యం దిగిరాకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. మానవహారం వల్ల నిలిచిపోయిన ట్రాఫిక్‌ను ఎస్ఐ సుదర్శన్‌తో పాటు పోలీస్ సిబ్బంది క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గాడి అప్పారావు, భీమయ్య, వప్పల బంగారునాయుడు, పిల్లా అప్పలరాజు, నమ్మి చిన్నబాబు, బొట్ట రమణ, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు, వైఎస్సార్ సీపీ నాయకులు సింగంపల్లి గణేష్, ఆతవ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



అరకు-విశాఖ రోడ్డులో బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మికులు

ఐదేళ్లూ ప్రజల గొంతుకై నిలుద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

- ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం
- జెడ్పీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: రానున్న ఐదేళ్ల ప్రజా సమస్యలపై పోరాడేందుకు ప్రజాగొంతుకై నిలుద్దామని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని ధర్మపురిలో గల సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో మాజీ మంత్రి పీడిక రాజన్నదొర అధ్యక్షతన సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ప్రజాతీర్పును గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రానున్న కాలంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని సూచించారు. తద్వారా జిల్లాలో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇదే సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాము అందుబాటులో ఉంటామని భరోసా కల్పించారు. అదే తరహాలో ద్వితీయ శ్రేణి నాయకత్వం కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించారు.

అందుబాటులో ఉంటాం..

మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానన్నారు. తన పాలనా కాలంలో ఏ ఒక ఉద్యోగికి, టీడీపీ కార్యకర్తకు, వ్యాపారులకు నష్టం కలగనీయలేదన్నారు. 2004, 2009, 2019 ఎన్నికల్లో ఓడిన టీడీపీ అభ్యర్థులు 2014, 2024లో గెలిచారని, సాలూరులో గుమ్మడి సంధ్యారాణి 1999, 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా, 2019లో ఎంపీగా పోటీ చేసినా ఓడిపోయారన్నారు. అభ్యర్థులు ఎవరైనా బరిలో నిలిచాక గెలుపోటములు సమానంగా స్వీకరించాల్సిందేనన్నారు.

టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను కుల మతాలు చూడకుండా, రాజకీయాలకు అతీతంగా నెరవేర్చాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ప్రజలకు చేయనున్న అభివృద్ధి కార్యక్రమాలకు నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రత్నాకర్, ఎంపీపీ సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెంచూరియన్‌లో మెడికల్ కోడింగ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయం లో పారా మెడికల్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వీసీ ప్రశాంత కుమార్ మహంతి ఆన్‌లైన్‌లో ఈ సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మా ఇండస్ట్రీలో మెడికల్ కోడింగ్ నేర్చుకునే వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ వ్యాధులను నిర్ధారించేటప్పుడు కోడింగ్ ఇస్తారని, విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కోడింగ్ నేర్చుకుంటే సాఫ్ట్‌వేర్ మాదిరిగా అత్యధిక వేతనాలు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు పాల్గొన్నారు.

కూలిన 17 విద్యుత్ స్తంభాలు



పెదమానాపురం సంత వద్ద కోళ్లఫారం వెనుక కూలిన విద్యుత్ స్తంభం

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి 17 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు ఏఈ ఆదిత్య తెలిపారు. కోమటిపల్లి, పెద మానాపేరం, ఇంగిలాపల్లి వంగర గ్రామాలతో పాటు కోమటిపల్లి-దత్తిరాజేరు రోడ్డులో బీటీ రోడ్డును ఆనుకుని ఉన్న స్తంభాలు, జాతీయ దారికి ఇరువైపులా కొన్ని స్తంభాలు కూలిపోయాయని వాటిని శనివారం సాయంత్రానికి పునరుద్ధరించనున్నామని తెలియజేశారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కా ర్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెం శ్రీనివాస కళాశాల సమీపంలో సుమారు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి కేబుల్ వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై స్థానికులందించిన సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కొంతకాలంగా మతిస్థిమితం లేక పరిసర ప్రాంతాల్లో ఈ వ్యక్తి తిరుగుతున్నాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. మృతుడి శరీరంపై కుమారి అనే పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని పోలీస్ సిబ్బంది కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహారాజా కేంద్రాస్పత్రికి తరలించారు.

పిడుగు పడి ఎద్దు మృతి



ఎద్దు కళేబరాన్ని ఖననం చేసేందుకు తీసుకువెళ్తున్న బాధితులు

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు గ్రామానికి చెందిన కోడి దుర్గారావు దుక్కిటెద్దు శుక్రవారం పిడుగు పడి మృతి చెందింది. పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కళ్లం వద్ద ఎద్దులను విడిగా కట్టి ఇంటికి చేరుకున్నానని, అనంతరం భారీ ఎత్తున పిడుగులతో కూడిన వర్షం కురవడంతో ఆందోళన చెంది కళ్లం వద్దకు వెళ్లి చూడగా ఓ ఎద్దు మరణించినట్లు గుర్తించామన్నారు. రూ.లక్ష 50వేల పైబడి ఈ ఎద్దుల జత ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹148	₹266	₹276

పోషకాలతోనే పశుసంపద వృద్ధి

- పశుసంవర్ధక శాఖాధికారుల సూచన



పాడిపశువులకు గడ్డి వేస్తున్న రైతు

రామభద్రపురం: పోషకాలతోనే పశుసంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, విటమిన్లు, నీరు అవసరముంటాయని పశుసంవర్థక శాఖాధికారులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా వారు సూచించిన వివరాలు వారి మాటల్లో..

మాంసకృత్తులు..

శరీర నిర్మాణానికి, పెరుగుదలకు, రోగ నిరోధకశక్తికి, హిమోగ్లోబిన్ రవాణాకు తోడ్పడతాయి.శరీరానికి శక్తిని సరఫరా చేస్తాయి. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడిపశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు బక్కచిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయాలు చిన్నగా ఉండడం, ఆలస్యంగా యుక్తవయసుకు రావడం, వ్యాధి నిరోధకశక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరిపిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి, మాంసంపొడి వంటి ముడిపదార్థాలు పప్పుజాతికి చెందిన పశుగ్రాసాల్లో సమృద్ధిగా లభిస్తాయి.

పిండిపదార్థాలు..

శరీరంలో కొవ్వునిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంస కృత్తులకంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైనది. కొవ్వు, పిండిపదార్థాల కన్నా రెండున్నర రెట్లు అధిక శక్తినిస్తాయి.ఒక గ్రాము కొవ్వుపదార్థం సుమారు 9కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని ప్రసాదిస్తాయి.వేరుశనగపిండి, కొబ్బరిపిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడు లాంటి పదార్థాల్లో కొవ్వుపదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు..

మేత లేకుండా పశువులు మూడు నెలలపాటు బతకగలిగినా నీరు లేకుండా ఐదురోజులకు మించి బతకలేవు.నీరు శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు ఎంతోగానో ఉపయోగపడుతుంది.నీరు ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు,విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాసప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థపదార్థాల విసర్జనక్రియలో దోహదపడుతుంది. శరీరంలోని మాంసపుకృత్తులు, కొవ్వుపదార్థాలు, పిండిపదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అరలీటర్ నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషకపదార్థం తరపున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడవు. పశువులు డీహైడ్రేషన్‌కు గురై మరణిస్తాయి.కాబట్టి నీరు కూడా పశువులకు అత్యవసరమయ్యే పోషక పదార్థాల్లో ఒకటిగా గుర్తించాలి. పశువులు తాగేందుకు రోజుకు 50-60 లీటర్లు నీరు అవసరం.



గొర్రెల మందను మేతకు తోలుతున్న కాపరి

వానాకాలంలో జాగ్రత్తలు..



వర్షాకాలంలో గొర్రెలు, మేకల పెంపకం దారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే చిటిక వ్యాధి, నీలి నాలుక వ్యాధి, పారుడు, కాళ్ల డెక్కల వ్యాధి, శ్వాసకోశ వ్యాధి వంటివి సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేసి వాటికి న్యుమోనియా వ్యాధి సోకకుండా కాపాడుకోవాలి.వ్యాధి సోకిన వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి.వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. అలాగే ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. వ్యాధి నుంచి కోలుకున్న తర్వాత మాత్రమే మందలో కలపాలి. ఒక వేళ గొర్రె లేదా మేక మృతి చెందితే వాటి కళేబరాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాలి.చనిపోయిన జీవి తినగా మిగిలిన గడ్డిని కూడా కాల్చివేయాలి. నీటి పాత్రలను క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టాలి.అలా జాగ్రత్తలు పాటిస్తే గొర్రెలు, మేకలను కాపాడుకోవచ్చు.మూగ జీవాలకు ఏ వ్యాధి సోకినా వెంటనే దగ్గరలో ఉన్న పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేయించడంతో పాటు అక్కడి పశువైద్యాధికారి సలహాలు,సూచనలు పాటించాలి.

ఎల్ విష్ణు, ఎ.డి, పశుసంవర్థకశాఖ బొబ్బిలి

విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌లు అందాలి

- స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పన



అక్కివరం పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ స్టూడెంట్ కిట్‌లను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు కల్పన

డెంకాడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌లు అందేలా ప్రణాళికాబద్ధంగా పని చేయాలని స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, స్టూడెంట్ కిట్‌ల పంపిణీ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన అన్నారు. ఈ మేరకు మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ మోడల్‌స్కూల్‌లో జరుగుతున్న స్టూడెంట్ కిట్లను, పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. మండలంలో ఉన్న 67 పాఠశాలలకు స్టూడెంట్ కిట్‌లను మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పంపిణీ చేశారు. దీనిని పరిశీలించిన రాష్ట్ర పరిశీలకురాలు కల్పన విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్ నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించేందుకు ఆయా పాఠశాలలకు కిట్‌లను పంపిణీ చేసిన తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన స్టాక్, పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంవో ఆదినారాయణ, ఎంఈవో-2 వి.శ్రీరామ్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్ పోటీల్లో సత్తా చాటాలి



శిక్షణ ముగించి వచ్చిన లోకేష్‌ను అభినందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

తెర్లాం: స్పెషల్ ఒలింపిక్ భారత్ క్రీడల పోటీల్లో తెర్లాం హైస్కూల్ తరపున పాల్గొననున్న క్రీడాకారుడు సత్తా చాటి రాష్ట్రస్థాయిలో పాఠశాలకు, జిల్లాకు పేరు తీసుకురావాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం రమేష్ కోరారు. స్పెషల్ ఒలింపిక్ భారత్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులకు ఈ నెల 7 నుంచి 11 వరకు అనంతపురంలోను, వైఎస్సార్ కడప జిల్లా గండికోటలో గల అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు తెర్లాం హైస్కూల్ నుంచి ప్రత్యేక ఉపాధ్యాయుడు సునీల్, తొమ్మిదో తరగతి విద్యార్థి లోకేష్ హాజరయ్యారు. శిక్షణ ముగించుకుని వచ్చిన వారిని అభినందించే కార్యక్రమాన్ని పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ, హెచ్‌ఎంలు మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్పెషల్ ఒలింపిక్ భారత్ పోటీల్లో లోకేష్ ప్రతిభ కనబరచాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఐఈఆర్‌టీ తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌కు చోరీ కేసు నిందితుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు

గజపతినగరం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న బి.తిరుపతి రావు (మెయిన్ రోడ్డులో సిమ్మెంట్, ఐరన్ వ్యాపారి) ఇటీవల చోరీ జరగడంతో బాధితుడు పోగొట్టుకున్న బంగారం, నగదును తక్కువ సమయంలోనే రికవరీ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియజేశారు. బాధితుడు తిరుపతి రావు ఈనెల 7వ తేదీన భార్యతో కలిసి పూరీ తీర్థయాత్రకు బయల్దేరాడు. అదే రోజు రాత్రి వారి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడాన్ని గమనించిన బాధితుడి మేనమామ తిరుపతి రావుకు ఫోన్ చేసి విషయం చెప్పి రప్పించాడు. ఫోన్ సమాచారం మేరకు తిరుపతిరావు హుటాహుటిన వచ్చి పరిశీలించేచి ఇంట్లో దాచుకున్న బంగారం, రూ.లక్ష నగదు పోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీస్ సిబ్బందితో పాటు సీఐ ఎస్‌వీ ప్రభాకరరావు, ఎస్సై యు.మహేష్‌లు సంఘటనా స్థలానికి వచ్చి ఫింగర్ ప్రింట్స్ సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టి చోరీ కేసులో నిందితుడిగా మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన పిల్లా సత్తిబాబును గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడు పోగొట్టుకున్న నగదు రూ.80వేలు, 14.5 తులాల బంగారం నిందితుడి దగ్గర నుంచి రికవరీ చేశారు. నిందితుడు దొంగతనానికి ఉపయోగించిన పనిముట్లు, ఓ బైక్‌ను సీజ్ చేశారు. సమావేశంలో సీఐ ప్రభాకరరావు, ఎస్సై యు.మహేష్‌లతో పాటు సిబ్బంది గోపి, సత్యనారాయణ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



రక్తదానంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫూల్‌బాగ్: కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు మాత్రమే కాకుండా సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం వంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని డీఎంహెచ్‌ఓ డా.ఎస్ భాస్కరరావు అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం, చేగువేరా జయంతి సందర్భంగా సీఐటీయూ, మెడికల్ రిప్స్ యూనియన్ ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంకులో శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్.ఎస్ భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్.బి.గౌరీశంకర్, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి శంకరరావు , కె.సురేష్ ,జిల్లా ఉపాధ్యక్షుడు జి.అప్పలసూరి, ఎం శ్రీనివాస, ఎ.గౌరీ నాయుడు, నగర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్ రావు, నగర ఉపాధ్యక్షుడు ఆర్ శంకర్రావు, మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీను, కోశాధికారి డీఎల్‌ఏ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

రాజాం సిటీ: ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ పరిష్కరించనున్నామన్నారు. న్యాయవాదులంతా లోక్‌అదాలత్‌కు సహకరించి వీలైనన్ని కేసులను పరిష్కరించుకోవాలని, అలాగే ఈ అవకాశాన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయి తేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రావినాయుడు, ఉపాధ్యక్షులు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, ఏజీపీ ఎస్.పోలారావు, ఎం.శ్రీనివాస రావు, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జామియా మసీదు అభివృద్ధికి కృషి



జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్.జాన్‌ను సత్కరిస్తున్న శ్రీకాకుళం జమియా మసీదు కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: శ్రీకాకుళంలోని జామియా మసీదు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్లు విజయనగరం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్.జాన్ పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ మనిజీర్ జిలానీ సమూన్ ఆదేశాలతో మసీదు కమిటీ అధ్యక్ష్యుడు మహిబుల్లాఖాన్‌తో కలిసి శుక్రవారం జామియా మసీదును సందర్శించి, సమస్యలపై ఆరాతీశామని జాన్ తెలిపారు. త్వరలోనే అభివృద్ధికి సంబంధించిన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ ప్రతినిధులు ఆయనను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మసీదు గౌరవాధ్యక్షుడు అమిరుల్లాబేగ్, సలీమ్లాఖాన్, ఉపాధ్యక్షులు సర్ఫరాజ్, కార్యదర్శి అక్బర్‌షా, ఎగ్జిక్యూటివ్ సభ్యులు షఫ్రుఖాన్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి ఒకరి మృతి



సీతారాం మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



గాయపడిన వెంకటనాయుడిని 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి మద్దివలస గ్రామ సమీపంలో పిడుగుపడి గ్రామానికి చెందిన వీరపిండి సీతారాం (33) మృతిచెందాడు. అదే గ్రామానికి చెందిన ఉత్తరావెల్లి వెంకటనాయుడు గాయపడి అస్వస్థతకు గురయ్యాడు. గ్రామ సమీపంలో ఉన్న మడ్డువలస రిజర్వాయర్ పరిసర ప్రాంతాలకు వారి పశువులను ఎప్పటిలాగానే ఉదయం సమయంలో మేతకు తీసుకువెళ్లారు. సాయంత్రం వాటిని తీసుకువచ్చేందుకు సీతారాం, వెంకటనాయుడు తోపాటు చిన్ని రమణ వెళ్లారు. గ్రామానికి కొంత దూరంలో ఉన్న నీలకోనేరు సమీపంలోకి వెళ్లే సరికి ఒక్కసారిగా వాతావరణం మార్పుచెంది మెరుస్తుండడాన్ని గమనించి వెనక్కి వచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఈ ముగ్గురు ఒకరి వెనుక ఒకరు వస్తుండగా ముందుగా నడుస్తున్న వీరపిండి శంకరరావుపై అగ్నిపిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక నడుస్తున్న ఉత్తరావెల్లి వెంకటనాయుడు గాయపడి అస్వస్థతకు గురయ్యాడు. అక్కడే ఉన్న చిన్ని రమణ వారిని చూసి కేకలు వేశాడు. ఇదే దారిలో పశువులను తెచ్చేందుకు వెళ్తున్న మరికొందరి వారిని గ్రామానికి చేర్చారు. వెంకటనాయుడును తొలుత వంగర పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి రెండేళ్ల క్రితం లావణ్యతో వివాహం కాగా ఏడాది వయసున్న కుమారుడు వీరన్నాయుడు ఉన్నాడు. మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు భోరున విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పిల్ల సన్యాసినాయుడు తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి..



రామారావు మృతదేహం

గంట్యాడ: మండలంలోని పెదమజ్జి పాలెం గ్రామానికి చెందిన కొంచాడ రామారావు(28) విజయనగరంలో పనిముగించుకుని ద్విచక్రవాహనంపై పెదమజ్జిపాలెం వెళ్తుండగా నరవ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న వెంటనే రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై సురేంద్ర నాయుడులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులను ఆరా తీసారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-19 చెస్ క్రీడాకారుల ఎంపిక రేపు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 16న జిల్లా స్థాయిలో అండర్-19 క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నగరంలోని ఫైర్ చెస్ స్కూల్ ఆవరణలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 2005 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు మాత్రమే అర్హులు గా పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి న నలుగురు అబ్బాయిలను, నలుగురు అమ్మాయిల ను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి పంపించనున్నట్లు చెప్పారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఫోన్ 9703344488 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భార్య టీడీపీ.. నేను వైఎస్సార్‌సీపీలోనే...

- మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు
- అన్యాయంగా ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించారు
- న్యాయం కోసం పోరాటం చేస్తా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విజయనగరం: భార్య టీడీపీలో చేరితే తనను ఎమ్మెల్సీ పదవిలో నుంచి తొలగించడం అన్యాయమని ఇందుకూరి రఘురాజు అన్నారు. ఏ తప్పు చేయకున్నా శాసన మండలి చైర్మన్ తనను అన్యాయంగా పదవీ చ్యుతుడిని చేశారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు. విజయనగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ముందు రోజు నాలుగో నోటీసు ఇచ్చి డిస్మిస్ చేశారని, గతంలో మూడు నోటీసులు వచ్చిన సందర్భంలో పార్టీ మీద వ్యతిరేకంగా మాట్లాడకూడదని ముందుగా స్పందించలేదన్నారు. షెడ్యూల్ 10 కింద డిస్మిస్ చేసినట్లు నోటీసులు ఇచ్చారని, పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం నేనేమీ పార్టీకి వ్యతిరేకంగా పని చేయలేదన్నారు. ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేసిన వ్యవహారాలు నచ్చక పోవడంతో పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. తను ఏ పార్టీలో చేరలేదని, ఏ పార్టీ కోసం పని చేయలేదన్నారు. భార్య ఇందుకూరి సుబ్బలక్ష్మి (సుధారాజు) టీడీపీలో చేరారని, టీడీపీ వాళ్లతో నేను టచ్‌లో ఉన్నానని కారణాలు చూపి సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. నోటీసులు జారీ చేసిన సమయంలో కొన్ని కారణాల వల్ల హాజరుకాలేక సమయం కోరినప్పటికీ తనకు అవకాశం ఇవ్వలేదన్నారు. తనకు పదవులు అంటే ఆసక్తి లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తనను పిలిచి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, ఇప్పటికీ తను వైఎస్సార్‌సీపీలోనే ఉన్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమి తనను బాధించిందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఎస్.కోట నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేశానని చెప్పారు.